క్లుప్తంగా

అయోధ్య అక్షింతల పంపిణీ



తెనాలిఅర్బన్: దాసాకూటి ఆశ్రమం వారి ఆధ్వర్యంలో అంగలకుదురు గ్రామంలో అయోధ్యలోని శ్రీరాముని అక్షింతలను శుక్రవారం ఇంటింటికి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా అధ్యక్షుడు పాటిబండ్ల రామకృష్ణ మాట్లాడుతూ అయోధ్య నుంచి వచ్చిన అక్షింతలు, శ్రీరాముని జెండాలను గ్రామంలో పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో కటారి వాసుదేవనాయుడు, కడియాల నందకిషోర్, కనగాల హరి, భారతి, అల్లూరి పద్మ, శైలజ, మాలతి, ప్రశాంతి, జయలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

జీవధ్వజ కలాపకర్షణ హోమం



ఫిరంగిపురం: మండలంలోని 113 తాళ్లూరు గ్రామంలోని రుక్మిణీ,సత్యభామ సమేత వేణుగోపాలస్వామి ఆలయంలోని ధ్వజస్తంభం జీర్ణావస్థకు చేరింది. కాగా నూతన జీవధ్వజం ఏర్పాటుచేసేందుకుగాను శుక్రవారం ఆలయంలో పండితులు విశేష పూజలు నిర్వహించారు. విశ్వక్షేణ పూజ, పుణ్యాహవాచనం, అఘారం, కలాపకర్షణ, హోమం,పూర్ణాహుతి కార్యక్రమాలను పండితులు డి.పవన్‌కుమార్, ప్రసన్నమూర్తి, కృష్ణమూర్తిలు నిర్వహించారు. అనంతరం జీవధ్వజం నుంచి కలాపకర్షణద్వారా స్వామివారికి కళలను ఆపాదించారు. పూజల్లో నిర్వాహకులు డి.ప్రభాకర్, భువనేశ్వరి దంపతులు పాల్గొన్నారు. కార్యక్రమాలను దేవాదాయ ధర్మాదాయ ఈవో రామిరెడ్డి, గ్రామపెద్దలు పర్యవేక్షించారు.

బోరు పంపునకు మరమ్మతులు



తాడేపల్లిరూరల్: మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోని మంగళగిరి రత్నాల చెరువు 4వ లైన్‌లో బోరు పంపుకు మరమ్మతుకు గురైనట్లు స్థానికులు శుక్రవారం సచివాలయంలో ఫిర్యాదు చేశారు. వెంటనే స్పందించిన ఎంటీఎంసీ ఇంజినీరింగ్ సిబ్బంది రత్నాల చెరువు 4వ లైన్లో ఉన్న బోరుపంపుకు మరమ్మతులు నిర్వహించారు. బోరుపంపులో ఉన్న పైపుల లీకేజ్ కారణంగా నీరు రావడం లేదని, వాటి స్థానంలో కొత్త పైపుల వేసి మరమ్మతుల నిర్వహించి పునరుద్ధరించినట్లు డి.ఇ. కృష్ణారెడ్డి తెలిపారు.

రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో సంక్రాంతి ముగ్గుల పోటీలు



తాడేపల్లిరూరల్: సంక్రాంతి పండుగను పురస్కరించుకుని ముగ్గుల పోటీలను నిర్వహించనున్నట్లు రోటరీ క్లబ్ ఆఫ్ మంగళగిరి అధ్యక్షులు అందె రేవంత్ శుక్రవారం తెలియజేశారు. ఈ సందర్భంగా మంగళగిరి రోటరీ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సంక్రాంతి పండుగను పురస్కరించుకుని ఈనెల 13వ తేదీ శనివారం ఉదయం 8 గంటలకు మంగళగిరి టిడ్కో గృహాల ప్రాంగణంలో ఈ పోటీలను నిర్వహిస్తున్నామని, ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులతో పాటు 6 కన్సలేషన్ బహుమతులు, అదేవిధంగా పోటీలలో పాల్గొన్న ప్రతి ఒక్కరికీ బహుమతి అందజేస్తామని తెలిపారు. మంగళగిరి పరిసర గ్రామాలకు చెందిన మహిళలు ఈ పోటీలలో పాల్గొనవచ్చని, 7995256609 లేదా 9948211176 నెంబర్లకు ఫోన్ చేసి తమ పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు. ముందస్తు రిజిస్ట్రేషన్ చేయించుకున్న వారు మాత్రమే ఈ పోటీలకు అనుమతించబడతారని, స్పాట్ రిజిస్ట్రేషన్ ఉండదని వివరించారు. కార్యక్రమ చైర్ పర్సన్ ధనలక్ష్మి, రోటరీ కార్యదర్శి గాజుల శ్రీనివాసరావు, క్లబ్ కోశాధికారి నూతలపాటి వెంకటేశ్వరరావు, చార్టర్ ప్రెసిడెంట్ ఇనునూరు అనిల్ చక్రవర్తి, డైరెక్టర్లు అందె మురళి మోహన్‌రావు, బట్టు వెంకటేశ్వరరావు, కాపరౌతు సుందరయ్య, జొన్నాదుల భిక్షారావు పాల్గొన్నారు.

బెల్ట్ షాప్ నిర్వాహకుడి అరెస్ట్

తాడేపల్లిరూరల్: మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోని తాడేపల్లి రూరల్ కొలనుకొండలో అక్రమ మద్యం విక్రయిస్తున్న ఓ వ్యక్తిని శుక్రవారం తాడేపల్లి పోలీసులు అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు. ఎస్ఐ రమేష్ కథనం ప్రకారం కొలనుకొండకు చెందిన మంటి సాంబశివరావు అనే వ్యక్తి ఇంటి వద్ద బెల్ట్ షాపు నిర్వహిస్తున్నాడని సమాచారం రావడంతో ఆయన ఇంటికి వెళ్లి తనిఖీ చేశామని, ఆ తనిఖీల్లో సాంబశివరావు దగ్గర 6 క్వార్టర్ బాటిళ్లు లభించాయని, అక్రమంగా మద్యం కలిగి ఉండి, వాటిని విక్రయిస్తున్నందుకు సాంబశివ రావుపై ఎక్సైజ్ చట్టం కింద కేసు నమోదు చేసి కోర్టుకుహాజరు పరిచినట్లు ఎస్ఐ తెలిపారు.

తెనాలిలో సామాజిక పింఛన్ల పంపిణీ



15వ వార్డులో వృద్ధాప్య పింఛన్ అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్ గుంటూరు కోటేశ్వరరావు



ఐతానగర్‌కు చెందిన వాణికి వికలాంగ పింఛన్ అందిస్తున్న వలంటీర్ ఉషాదేవి



చంద్రబాబునాయుడు కాలనీలో షేక్ బాషుకు పింఛన్ అందజేస్తున్న వలంటీర్ శ్రీవేణి

తెనాలి పట్టణంలో వైఎస్సార్ పింఛన్ కానుక పంపిణీ కార్యక్రమం శుక్రవారం ప్రారంభమైంది. వార్డు వలంటీర్‌లు లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పంపిణీ చేశారు. ఐతానగర్‌కు చెందిన చిన్నం వాణికి వృద్ధాప్య పింఛన్‌ను వలంటీర్ సీహెచ్ ఉషాదేవి పంపిణీ చేశారు. కొత్తపేటకు చెందిన పి.మారుతీకి వృద్ధాప్య పింఛన్‌ను వలంటీర్ బి.శివశరణ్, చంద్రబాబునాయుడు కాలనీకి చెందిన షేక్ బాషుకు వలంటీర్ శ్రీవేణి పంపిణీ చేశారు. 15వ వార్డులో సామాజిక పింఛన్ కానుకను వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్ గుంటూరు కోటేశ్వరరావు లబ్ధిదారులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సచివాలయ ఉద్యోగులు, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

- తెనాలిఅర్బన్

చెత్త సేకరణలో ఇబ్బందులు లేకుండా చూడండి

మున్సిపల్ ఆర్‌డీ శ్రీనివాసరావు



రైతుబజార్‌లో పర్యటిస్తున్న ఆర్‌డీ శ్రీనివాసరావు

తెనాలిఅర్బన్: మున్సిపల్ కార్మికుల సమ్మె నేపథ్యంలో ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా తగు చర్యలు తీసుకోవాలని మున్సిపల్ గుంటూరు రీజనల్ డైరెక్టర్ జి.శ్రీనివాసరావు ఆదేశించారు. పట్టణంలోని కొత్తపేట, వహబ్‌చౌక్, చెంచుపేట, బుర్రిపాలెం రోడ్డులోని రైతుబజార్‌లను శుక్రవారం ఆయన పరిశీలించారు. అక్కడ జరుగుతున్న పారిశుద్ధ్య నిర్వహణ పనులను పరిశీలించి పలు సూచనలు చేశారు. చెత్త సేకరణలో ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా తగు చర్యలు తీసుకోవాలన్నారు. ఔట్‌సోర్సింగ్ పారిశుద్ధ్య కార్మికులు కూడా ప్రభుత్వానికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు. గతంలో వలే డోర్ టు డోర్ కలెక్షన్‌ను ఆటోల ద్వారా చేయాలని అందుకు అవసరమైన రోజు వారి కూలీలను నియమించుకోవాలన్నారు. ఆయన వెంట కమిషనర్ ఎం.జశ్వంతరావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు ఎ.రామచంద్రరావు, డి.శ్రీనివాసరావులు ఉన్నారు.

రాష్ట్రంలో సంక్షేమ విప్లవం

మున్సిపల్ చైర్‌పర్సన్ రాధిక



ఏపీకి జగన్ ఎందుకు అవసరం బుక్‌లెట్‌ను ఆవిష్కరిస్తున్న చైర్‌పర్సన్ రాధిక

తెనాలిఅర్బన్: రాష్ట్రంలో సంక్షేమ విప్లవాన్ని తీసుకువచ్చిన ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అని మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక పేర్కొన్నారు. వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని 16వ వార్డు ముత్తెంశెట్టిపాలెంలోని సచివాలయం వద్ద శుక్రవారం సాయంత్రం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేని విధంగా సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి తమ ప్రభుత్వం అమలు చేస్తుందని చెప్పారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు లబ్ధి చేకూర్చడం జరుగుతుందన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతి హామీని అమలు చేసినట్లు వివరించారు. వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీకి ప్రజలందరూ ఓట్లు వేసి గెలిపించాలని కోరారు. మాజీ కౌన్సిలర్ కాళిదాసు విజయ మాట్లాడుతూ తమ వార్డులో ఇప్పటి వరకు రూ.22.49కోట్ల సంక్షేమాన్ని అందించినట్లు తెలిపారు. అనంతరం సచివాలయంలో ఏర్పాటు చేసిన లబ్ధిదారుల వివరాలు తెలియజేసే బోర్డులను, ఆంధ్రప్రదేశ్‌కు జగన్ ఎందుకు అవసరం బుక్‌లెట్‌లను ఆవిష్కరించారు. అలాగే పార్టీ జెండాను ఆవిష్కరించారు. సమావేశంలో మున్సిపల్ మేనేజర్ అప్పలరాజు, వైఎస్సార్‌సీపీ నాయకులు కాళిదాసు వెంకటసత్యం, సచివాలయ ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఇంటి పన్ను సకాలంలో చెల్లించండి

గ్రామసభలో పంచాయతీ ఇన్‌చార్జి కార్యదర్శి కల్పన



గ్రామ సభలో మాట్లాడుతున్న ఇన్‌చార్జి కార్యదర్శి కల్పన

తెనాలిటౌన్: గ్రామంలోని ప్రజలు సకాలంలో ఇంటి పన్ను చెల్లించి గ్రామాభివృద్ధికి సహకరించాలని కొలకలూరు పంచాయతీ ఇన్‌చార్జి కార్యదర్శి సూరపనేని కల్పన కోరారు. రూరల్ మండలం కొలకలూరులోని పంచాయతీ కార్యాలయంలో శుక్రవారం గ్రామసభ నిర్వహించారు. సభకు పంచాయతీ 13వ వార్డు సభ్యులు రావూరి రవిబాబు అధ్యక్షత వహించారు. గ్రామసభలో పంచాయతీ ఇన్‌చార్జి కార్యదర్శి కల్పన మాట్లాడుతూ గ్రామంలో డంపింగ్ యార్డు ఏర్పాటుకు స్థల సేకరణకు సహకరించాలని కోరారు. గ్రామ పంచాయతీలో జనరల్ ఫండ్ రూ.4లక్షలు, 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.8లక్షలు, సీఎఫ్ఎంఎస్ నిధులు రూ.6లక్షలు ఉన్నట్లు తెలిపారు. ఈ నిధులతో తాగునీరు, డ్రైన్స్ ఏర్పాటు, కార్మికుల జీతాలు చెల్లించేందుకు వార్డు సభ్యులు తీర్మానం చేసినట్లు తెలిపారు. వీఏపీ రూరల్ ఎస్ఐ ప్రసన్నకుమార్ మాట్లాడుతూ గ్రామంలో ఎక్కడపడితే అక్కడ మద్యం సేవించరాదని, మద్యం సేవించే వారి సమాచారం తమకు తెలియజేయాలన్నారు. గ్రామ సభలో ఎంపీటీసీ సభ్యురాలు చెక్కా సీతమ్మ, వీఆర్వో సురేష్, ఇంజనీరింగ్ అసిస్టెంట్ వంశీ, ఏఎన్ఎం గజలక్ష్మి, మహిళ సంరక్షణ కార్యదర్శి మల్లిక, వార్డు సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

జిల్లా వైద్యశాలలో ఆర్‌వోపీ స్క్రీనింగ్



బరువుతక్కువతో పుట్టిన బిడ్డలకు పరీక్షలు చేస్తున్న డాక్టర్ పావని, డాక్టర్ మధుబాబు

తెనాలిఅర్బన్: బరువు తక్కువతో పుట్టిన చిన్నారులకు జిల్లా వైద్యశాల ఆవరణలోని జిల్లా సత్వర చికిత్స కేంద్రంలో శుక్రవారం రెటినా ఆఫ్ ప్రీ మెట్యూరిటీ స్క్రీనింగ్ నిర్వహించారు. చిన్నారుల్లో కంటి చూపు, వినికిడి శక్తి ఎలా ఉంది అనే దానిపై పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి డాక్టర్ పావని, పిల్లల వైద్య నిపుణులు డాక్టర్ మధుబాబులు మాట్లాడుతూ రాజమండ్రికి చెందిన గౌతమి ఐ హాస్పిటల్ సహకారంతో లేజర్ పరీక్షలు చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఆడియాలజిస్ట్ డాక్టర్ నివేదిత, డెంటల్ వైద్యులు డాక్టర్ సుజాత, ఫిజియోథెరపిస్ట్ డాక్టర్ విశ్వశాంతి, సైకాలజిస్ట్ డాక్టర్ నాగ కోటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

పలువురు విద్యుత్ ఏఈలు బదిలీ

తాడేపల్లి రూరల్: మంగళగిరి తాడేపల్లి పట్టణ, రూరల్ ప్రాంతాల్లో పనిచేస్తున్న విద్యుత్ శాఖ ఏఈలను బదిలీ చేస్తున్నట్లు డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ అక్కల సత్యనారాయణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మంగళగిరి రూరల్ సెక్షన్ విద్యుత్ శాఖ ఏఈగా బాధ్యతలు నిర్వహిస్తున్న ఎ. లక్ష్మి నారాయణను తాడేపల్లి మండల పరిధిలోని మహానాడు ఆఫీస్‌కు, తాడేపల్లి పరిధిలోని మహానాడు ఆఫీస్‌లో కుంచనపల్లి సెక్షన్ ఏఈగా బాధ్యతలు నిర్వహిస్తున్న ఎస్. నాగమల్లేశ్వరరావును మండల ఆఫీసు ప్రాంగణంలోని మంగళగిరి రూరల్ సెక్షన్ ఏఈగా బదిలీ చేస్తున్నామని ఆయన ఆ ప్రకటనలో తెలిపారు.

జగనన్న విద్యాజ్యోతి స్టడీ మెటీరియల్ పంపిణీ

కాకుమాను: విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని, ప్రతి విద్యార్థిని కష్టపడి చదవాలని జెడ్పీటీసీ ముజావర్ షేక్ గుల్జార్ బేగం అన్నారు. స్థానిక డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల(బాలికలు)పాఠశాల విద్యార్థినులకు శుక్రవారం జగనన్న విద్యాజ్యోతి స్టడీ మెటీరియల్‌ను పంపిణీ చేశారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న గుల్జార్ బేగం మాట్లాడుతూ పేదరికం విద్యకు అడ్డురాకూడదనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యా రంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చారని, ప్రభుత్వ పాఠశాలల్లో అనేక సౌకర్యాలు కల్పించారన్నారు. పదవ తరగతి విద్యార్థులకు స్టడి మెటీరియల్ పంపిణీ చేశారు. ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

యువతి ఆత్మహత్య

తెనాలిరూరల్: పెళ్లి చేసేందుకు తల్లిదండ్రులు సంబంధాలు చూస్తుండడంతో ఇష్టంలేని యువతి ఆత్మహత్యకు పాల్పడింది. పోలీసులు కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. పట్టణ సుల్తానాబాద్‌కు చెందిన కుంచాల స్వాతి(24) ఎంఫార్మసీ చదివింది. కుమార్తెకు వివాహం చేసేందుకు తల్లిదండ్రులు, కుటుంబసభ్యులు సంబంధాలు చూస్తున్నారు. వివాహం ఇష్టం లేని ఆమె గురువారం రాత్రి ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. శుక్రవారం సమాచారం అందుకున్న త్రీ టౌన్ పోలీసులు ఘటనాస్థలాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని తెనాలి జిల్లా వైద్యశాలకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఎం.విజయ్‌కుమార్ తెలిపారు.

రోడ్డు ప్రమాదానికి కారణమైన డ్రైవర్ అరెస్ట్

తెనాలిరూరల్: రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతికి కారణమైన డ్రైవర్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. చేబ్రోలులోని విజన్ యూనివర్సిటీలో పని చేసే చేబ్రోలు మండలం శేకూరుపాలెంకు చెందిన నెమలికంటి బాబురావు(43) ఈ నెల 3వ తేదీ రాత్రి విధులు ముగించుకుని బైక్‌పై ఇంటికి వెళుతున్నాడు. తెనాలి మండలం సంగంజాగర్లమూడి లాకుల వద్ద కారు ఢీకొట్టడంతో తీవ్ర గాయాలపాలై మృతి చెందాడు. రూరల్ ఎస్ఐ సీహెచ్ వెంకటేశ్వర్లు కేసు నమోదు చేసి దర్యాప్తు చేయగా నిందితుడు చిలకలూరిపేట సమీపంలోని గణపవరంకు చెందిన బండారు వెంకట నాగ అజయ్‌గా గుర్తించి శుక్రవారం అరెస్ట్ చేశారు.

మేడ్ 2024 క్యాలెండర్ ఆవిష్కరణ



తాడేపల్లిరూరల్: మంగళగిరి తాడేపల్లి కార్పొరేషన్ పరిధిలోని తాడేపల్లి ఏపీజీఇఎఫ్ రాష్ట్ర కార్యాలయంలో మోడల్ అసోసియేషన్ ఆఫ్ దళిత్ ఎంప్లాయిస్ ఏపీ మేడ్ క్యాలెండర్‌ను ఏపీజీఇఎఫ్ చైర్మన్ జనరల్ అరవపాల్ శుక్రవారం ఆవిష్కరించారు. సంఘ రాష్ట్ర అధ్యక్షులు మురికిపూడి దేవపాల్ మాట్లాడుతూ సంఘ స్థాపన నుంచి నేటి వరకు దళిత ఉద్యోగుల సమస్యల పరిష్కార దిశగా మేడ్ పనిచేస్తోందని, దళిత ఉద్యోగ హక్కుల సంరక్షణే ధ్యేయంగా పనిచేస్తోందన్నారు. రానున్న రోజుల్లో ఏపీజీఈఎఫ్ సహకారంతో మరింత బలోపేతంగా సంఘ కార్యక్రమాలను నిర్వహిస్తామన్నారు. అనంతరం సెక్రటరీ జనరల్ అరవపాల్‌ను సత్కరించారు. మేడ్ రాష్ట్ర వ్యవస్థాపకులు శృంగారపాటి శ్యామ్ సుందర్, నాయకులు రావెల నల్లయ్య, యల్లమాటి రవికుమార్, ప్రతాప్, ఉందుర్తి సుబ్బారావు పాల్గొన్నారు.

అక్రమ మద్యం విక్రేత అరెస్టు

ప్రత్తిపాడు: అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తిని పోలీసులు అరెస్టు చేసిన ఘటన మండలంలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల మేరకు..చినకోండ్రుపాడు గ్రామానికి చెందిన మాకాని రామయ్య అక్రమంగా మద్యం విక్రయిస్తున్నాడన్న సమాచారంతో గురువారం రాత్రి ఎస్ఐ డి.రవీంద్రబాబు తన సిబ్బందితో కలిసి దాడి చేశారు. అతని నుంచి ఏసీ బ్లాక్ క్లాసిక్ విస్కీ 180 ఎంఎల్ నాలుగు బాటిళ్లు, గోల్డెన్ పెరల్ విస్కీ 180 ఎంఎల్ ఒక బాటిల్ స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు అతనిపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

మలినేనిలో డిజైన్ థింకింగ్‌పై వర్క్‌షాప్



అవగాహన కల్పిస్తున్న కంపెనీల ప్రతినిధులు

ప్రత్తిపాడు: వట్టిచెరుకూరు మండలం పుల్లడిగుంట మలినేని లక్ష్మయ్య ఉమెన్స్ ఇంజినీరింగ్ కళాశాలలో శుక్రవారం డిజైన్ థింకింగ్‌పై వర్క్ షాప్ నిర్వహించారు. ఐడియా ల్యాబ్స్ ఆధ్వర్యంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అండ్ డేటా సైన్స్, ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ అండ్ మెషిన్ లెర్నింగ్‌పై ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు జరిగిన వర్క్ షాప్‌కు ముఖ్య అతిథులుగా ఐడియా ల్యాబ్స్ సీఈఓ పంకజ్ దివాన్, డిజైన్ థింకింగ్ ఎవాంజలిస్ట్ ఆర్. శ్రీకాంత్ హాజరయ్యారు. డిజైన్ థింకింగ్, మైండ్ మ్యాపింగ్ టెక్నిక్స్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో మలినేని కళాశాలల చైర్మన్ మలినేని పెరుమాళ్లు మాట్లాడుతూ విద్యార్థులు నూతన శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానాన్ని అలవాటు చేసుకుని అన్ని రంగాల్లోనూ రాణించాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జె. అప్పారావు, డీన్ రమేష్ పాల్గొన్నారు.

కనులపండువగా..
చండీసహిత హనుమధీశ్వర శోభాయాత్ర



ఉత్సవ విగ్రహాలకు పూజలు చేస్తున్న శివకుమార్, పుష్ప దంపతులు

తెనాలిటౌన్: పట్టణ బోసురోడ్డులోని శ్రీ వాసవీ కన్యకాపరమేశ్వరి దేవస్థానం ఆవరణలో హనుమాన్ ఉపాసకులు వుప్పల వరదరాజులు పర్యవేక్షణలో తలపెట్టిన చండీసహిత హనుమధీశ్వర మహాయజ్ఞం ప్రారంభం కానున్న సందర్భంగా శుక్రవారం సాయంత్రం స్వామివార్లకు శోభాయాత్రను అత్యంత వైభవంగా నిర్వహించారు. ప్రత్యేక వాహనంపై ఉత్సవ విగ్రహాల తరలింపును అనేక మంది భక్తులు అనుసరిస్తూ యాత్రలో పాల్గొనటం విశేషం. ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్, పుష్ప దంపతులు, హనుమత్ ఉపాసకులు డాక్టర్ పి.శ్రీనివాస్ ఉత్సవ విగ్రహాలను తీసుకువచ్చారు. మహాయజ్ఞంలో పూజలందుకొనే సీతారాముల, హనుమత్ ఉత్సవ విగ్రహాలను తొలుత మార్కెట్ సెంటర్‌లోని సీతారామాంజనేయ దేవస్థానంలో పూజలు జరిపారు. హనుమత్ ఉపాసకులు డాక్టర్ పి.శ్రీనివాస్ పర్యవేక్షణలో అక్కడి నుంచి శోభాయాత్ర ఆరంభమైంది. భక్తులు అనుసరిస్తుండగా కళాకారులు, మహిళల కోలాటం, భజనలతో శోభాయాత్ర ప్రారంభమైనంది. మార్కెట్ ప్రాంగణం జైశ్రీరామ్, జైహనుమాన్ అంటూ నామస్మరణతో మారుమోగింది. మార్కెట్ సెంటర్ నుంచి బోసురోడ్డు మీదుగా వాసవీ ఆలయం వరకు శోభాయాత్ర కొనసాగింది. శోభాయాత్రలో ప్రజలు, యువకులు, విద్యార్థులు పాల్గొన్నారు. విగ్రహాలను మహాయజ్ఞం జరిగే ఆలయ ఆవరణకు చేర్చారు. కొబ్బరికాయలు కొట్టి పూజలు చేశారు. హనుమత్ ఉపాసకులు డాక్టర్ పి.శ్రీనివాస్ మాట్లాడుతూ లోకకళ్యాణార్థం ప్రజలు సుఖశాంతులతో జీవించాలనే సంకల్ప దీక్షతో యజ్ఞం చేస్తున్నామని అన్నారు. ఎమ్మెల్యే శివకుమార్ మాట్లాడుతూ ఈ ప్రాంత ప్రజలు చల్లగా, సుఖశాంతులతో ఉండాలని దేవుని ఆశీస్సుల కోసం మహాయజ్ఞం చేపట్టినట్లు చెప్పారు. తెనాలి ప్రాంత ప్రజలు మహాయజ్ఞంలో పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక, వుప్పల వరదరాజులు, మద్దాలి శేషాచలం, దేసు శ్రీనివాసరావు, చుండూరు సాయి, ఆలమూరి విజయలక్ష్మికుమారి, మాజీ ఎంపీపీ చెన్నుబోయిన శ్రీనివాసరావు, పురుషోత్తమశర్మ, టి.అశోక్ యాదవ్, బూరెల దుర్గాప్రసాద్, కుర్రా శ్రీనివాస్, మీరావళి, కఠారి హరీష్, అక్కిదాసు కిరణ్, కాళహస్తి భవానీ శంకర్, ఎస్.రఘురామిరెడ్డి, కడియాల సురేష్, పెసర్లంక రమణ, బండి హైమారావు, గుదిబండి కృష్ణకిషోర్‌రెడ్డి, అవుతు పోతిరెడ్డి, డీఎస్పీ జనార్ధనరావు, సీఐ చంద్రశేఖర్, దేవస్థాన కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఫ్రైడే.. డ్రైడే.. ర్యాలీ



ర్యాలీలో పాల్గొన్న జిల్లా మలేరియా అధికారి మురళీకృష్ణ సుబ్బరాయణం



రికార్డులు పంపిణీ చేస్తున్న జిల్లా మలేరియా అధికారి మురళీకృష్ణ సుబ్బరాయణం

తెనాలిఅర్బన్: తెనాలి పట్టణంలోని ప్రజలందరూ ఫ్రైడేను డ్రైడేగా పాటించాలని జిల్లా మలేరియా అధికారి తలాటం మురళీకృష్ణ సుబ్బరాయణం పేర్కొన్నారు. మలేరియా విభాగం ఆధ్వర్యంలో శుక్రవారం ఐతానగర్‌లో ర్యాలీ నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి దోమల నియంత్రణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నీరు నిల్వ ఉండటం వలన దోమల వ్యాప్తి పెరుగుతుందని, ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మలేరియా అధికారి సీహెచ్ ప్రభాకర్‌రెడ్డి, రాజు నాయక్, సబ్ యూనిట్ మలేరియా అధికారులు శ్రీకంఠ ఉమాకాంత్, వంగాల పున్నారెడ్డి, ఆరోగ్య విస్తరణాధికారి అందె బాలచంద్రమౌళి, హెల్త్ ఇన్‌స్పెక్టర్ రవికుమార్, తదితరులు పాల్గొన్నారు.

వార్డు హెల్త్ సెక్రటరీలకు రికార్డులు పంపిణీ..

తెనాలి పట్టణంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో పనిచేసే వార్డు హెల్త్ సెక్రటరీలు, ల్యాబ్ టెక్నీషియన్‌లకు 2024వ సంవత్సరానికి సంబంధించిన రికార్డులను జిల్లా మలేరియా అధికారి తలాటం మురళీకృష్ణ సుబ్బరాయణం పంపిణీ చేశారు. నందులపేటలోని వైఎస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్‌లో జరిగిన కార్యక్రమంలో వైద్యాధికారిణి డాక్టర్ బీబీజాన్, సిబ్బంది పాల్గొన్నారు.

డిపోను అగ్రగామిగా నిలపండి

ఆర్టీసీ గుంటూరు రీజనల్ మేనేజర్ ఎం.రవికాంత్



మాట్లాడుతున్న రీజనల్ మేనేజర్ రవికాంత్

తెనాలిఅర్బన్: అధికారులు, ఉద్యోగులు సమన్వయంతో పనిచేస్తూ తెనాలి డిపోను రీజనల్ పరిధిలోనే ప్రథమస్థానంలో నిలపాలని ఆర్టీసీ గుంటూరు రీజనల్ మేనేజర్ ఎం.రవికాంత్ సూచించారు. తెనాలి డిపోన్ శుక్రవారం ఆయన పరిశీలించారు. గ్యారేజిలో ఉద్యోగులతో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బస్సుల నాణ్యత ప్రమాణాలను మెరుగు పరిచేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఉద్యోగులు కూడా మంచి నైపుణ్యాన్ని కలిగి ఉండాలన్నారు. బస్సులు బ్రేక్ డౌన్ కాకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ప్రయాణికుల నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ వారికి మంచి సేవలు అందించాలన్నారు. సిబ్బందికి ఏవైనా సమస్యలు ఉంటే తనకు తెలియజేయాలని సాధ్యమైనంత వరకు వాటిని పరిష్కరించే విధంగా చూస్తానని హామీ ఇచ్చారు. సమావేశంలో మేనేజర్ ఎ.రాజశేఖర్, అసిస్టెంట్ మేనేజర్ ఐజే ప్రసాదరావు, అసిస్టెంట్ ఇంజినీర్ ఎస్‌ఏ నాయక్, తదితరులు పాల్గొన్నారు.

రహదారి భద్రతపై అవగాహన కలిగి ఉండాలి

తెనాలి ఆర్టీఓ కె.ప్రసాద్



ప్రతిజ్ఞ చేస్తున్న తెనాలి ఆర్టీఓ కె.ప్రసాద్, ట్రైనీ ఆర్టీఓలు

చేబ్రోలు: వాహనదారులు రహదారి భద్రతపై అవగాహన కలిగి ఉండాలని తెనాలి ఆర్టీఓ కె.ప్రసాద్ అన్నారు. చేబ్రోలు మండలం నారాకోడూరులోని సెయింట్ మేరీస్ కళాశాలలో శుక్రవారం రోడ్డు భద్రతపై అవగాహనా కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్, సీటు బెల్టు ధరించాలని సూచించారు. ప్రమాదం జరగకముందు తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ట్రైనీ ఆర్టీఓలు మనోహర్, భరత్ చవాన్ మాట్లాడుతూ వాహనదారులు, పాదచారులు రహదారి నియమనిబంధనలు పాటిస్తూ ప్రమాదాలు జరగకుండా జాగ్రత్త వహించాలన్నారు. అతి వేగం ప్రమాదకరమని, వాహనాలు నడుపుతూ సెల్ పోన్ మాట్లాడకూడదన్నారు. ఆటోలలో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించకూడదని తెలియజేశారు. ఏఎంవీఐ మధుసూదన్ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలు జరిగినప్పుడు తీసుకోవలసిన జాగ్రత్తలు, గోల్డెన్ అవర్ ప్రాముఖ్యత వివరించారు. ఎంవీఐ రాఘవరావు రహదారి భద్రత వీడియోలను ప్రదర్శించి, విద్యార్థులకు పలు సూచనలు చేశారు. కళాశాల ప్లేస్‌మెంట్ ఆఫీసర్ ఎం హిమబిందు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

జూదరుల అరెస్టు

ప్రత్తిపాడు: రహస్యంగా పేకాట ఆడుతున్న ఎనిమిది మంది జూదరులను పోలీసులు అరెస్టు చేశారు. వట్టిచెరుకూరు మండలం కర్నూతలలో గుట్టుచప్పుడు కాకుండా పేకాట ఆడుతున్నారన్న స్పెషల్ బ్రాంచి సమాచారంతో ఎస్ఐ కె. కోటేశ్వరరావు శుక్రవారం తన సిబ్బందితో కలిసి దాడి చేశారు. పేకాట ఆడుతున్న ఎనిమిది మంది జూదరులను అదుపులోకి తీసుకుని, వారి నుంచి రూ.21,400 నగదు, పేక ముక్కలు స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి, కోర్టులో హాజరు పరచనున్నట్లు ఎస్ఐ తెలిపారు.